క్లుప్తంగా

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు



బోల్తాపడిన ఆటో

పెద్దకడబూరు: ఆటోబోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామ సమీపంలో ఎల్ఎల్‌సీపై సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, ఆటోలో ప్రయాణిస్తున్న ఈరమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కొంతమంది, అగ్రహారం గ్రామానికి చెందిన మరికొందరు శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి ఆటోలో బయలుదేరారు. దర్శనం ముగించుకొని సొంత గ్రామానికి తిరుగుప్రయాణం అయ్యారు. నౌలేకల్లు గ్రామం సమీపంలోని ఎల్ఎల్‌సీ గట్టు ఎక్కించబోయి ఆటో అదుపు తప్పి కాలువపై పడిపోయింది. అందులో చిన్న పిల్లలతో పాటు దాదాపు 12మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అగ్రహారం నరసమ్మకు మాత్రం తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆమెను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ నిరంజన్‌రెడ్డిని సంప్రదించగా.. ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై చర్చించి నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. అదేవిధంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలను పెంచాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమల్లోకి తేవాలని కోరారు.

ఈరన్న స్వామికి వెండి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి సోమవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. హైదరాబాద్ వాస్తవ్యులు గుండప్ప వారి కుటుంబ సభ్యులు కిలో వెండి, అష్టలక్ష్మిబిందెను విరాళంగా దేవాలయ కార్యాలయంలో అందజేసినట్లు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. అలాగే కర్నూలుకు చెందిన సురేష్ 205గ్రాముల వెండి చెంబును విరాళంగా అందజేశారని చెప్పారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం



ఆర్టీసీ సిబ్బందికి భోజన ప్యాకెట్లు అందజేస్తున్న డీఎం అమర్నాథ్

ఎమ్మిగనూరుటౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే ఆర్టీసీ లక్ష్యమని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్ అన్నారు. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఉరుకుంద పుణ్యక్షేత్రానికి స్థానిక డిపోతో పాటు ఇతర డిపోల బస్సులను కూడా నడుపుతుండటంతో డ్రైవర్లు, కండెక్టర్లకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. సోమవారం బస్సు డ్రైవర్లు, కండెక్టర్లకు భోజన ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సంఘ డిపో కార్యదర్శి ముస్తాక్ అహమ్మద్, సుగ్రీవుడు, మునిస్వామి, ఎంప్లాయిస్ యునియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గౌస్, ఎంఎస్ వాసు, బసవరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గీతామందిరంలో కృష్ణాష్టమి



శ్రీ కృష్ణుడి ఊంజల సేవలో చిన్నారులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని గీతామందిరం వెలసిన శ్రీకృష్ణుడి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మంత్రాలయం వేదపండితులు జనార్దన్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫల, పుష్పాలంకరణలు గావించి, మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే శ్రీకృష్ణుడికి భక్తుల మధ్య స్వామి వారి ఊంజల సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఎరిగేరి శ్రీనివాసులు, కొళ్లి రామకృష్ణ, బంగారు వెంకోబ, పార్థసారధి, రంగస్వామి, డాక్టర్ హెచ్. గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలి



ప్రభుత్వాసుపత్రులలో ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేయాలి. రోగులతో పాటు అనేక మంది వస్తుంటారు. అందులో ఎవరు ఎలాంటి వారో తెలియదు. కొంతమంది మద్యం తాగి దరుసుగా ప్రవర్తిస్తుంటారు. దీంతో చాల మంది మహిళా డాక్టర్లతో పాటు సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో విధులను నిర్వర్తించాలి అంటే ఆందోళనకు గురవుతున్నారు. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే రాత్రి వేళల్లో విధులను నిర్వర్తించే వారికి పూర్తిగా రక్షణ కల్పించాలి.

– కె. వినోద్‌కుమార్, వైద్యుడు, ఆదోని



మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి



ఆగస్టు 9వ తేదీన కోలకతాలోని ఆస్పత్రిలో మహిళా వైద్యురాలిపై హత్యాచార ఘటన జరగడం బాధాకరం. ఒక మహిళా వైద్యురాలికి ఆస్పత్రుల్లో భద్రత కరువయ్యిందంటే చాలా విచారకరమైన విషయం. మహిళా వైద్యురాళ్లకు ఆస్పత్రుల్లో భద్రత కల్పించి మనోధైర్యం ఇవ్వాలి. కొత్త చట్టాలను చేయాలి. ఆస్పత్రుల్లో సెక్యూరిటీని పెంచాలి. ఇలాంటివి పునరావృత్తంగాకుండా చర్యలు తీసుకోవాలి. సమాజంలో మార్పుకై ప్రతిఒక్కరూ పాటుపడాలి.

– ఉషారావు, వైద్యురాలు, ఐఎంఏ మాజీ అధ్యక్షురాలు, ఆదోని

యువకుడి ఆత్మహత్య

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం కిలిచిన్ పేటకు చెందిన బి. చంద్ర కుమారుడు బి.వీరేష్(22) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఆదోని–ఇస్వీ ఆర్ఎస్‌ల కిలో మీటరు నంబర్ 496/8–10ల మధ్య డౌన్ లైన్ ట్రాక్ వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. కడుపు నొప్పి భరించ లేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ప్రత్యేక వెండి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ వేణుగోపాలస్వామి



రథోత్సవంలో కోలాటం ఆడుతున్న బాలికలు



రథం ముందు చిందులు వేస్తున్న గొరవయ్యలు



శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



పెద్దనేలటూర్‌లో రథం ముందు హారతులు పట్టుకొని వస్తున్న చిన్నారులు, మహిళలు

కృష్ణం వందే జగద్గురుం

- ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- వైభవంగా శ్రీ వేణుగోపాలస్వామి రథోత్సవం



ఆదోనిలో రుక్మిణి, గోపికలతో శ్రీకృష్ణుడు



రామ, లక్ష్మణ, సీత, హనుమ వేషధారణలో చిన్నారులు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువజామున శ్రీకృష్ణుడికి గోపూజ, పంచామృతాభిషేకం, తులసీ సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరిగింది. సాయంత్రం రుక్మిణి, కృష్ణ ఉత్సవ మూర్తులను రథంపై కొలువుంచి ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. రథం ముందు చిన్నారులు, యువతులు కలశాలతో ఊరేగించారు. డోలు, సన్నాయిల మధ్య గొరవయ్యల నృత్యాలు, చిన్నారులు, బాలికలు కోలాటాలు భక్తులను అలరించాయి. హరే కృష్ణ... హరే కృష్ణ... కృష్ణ కృష్ణ హరేహరే ... అనే నామస్మరణతో భక్తులు రథాన్ని కదిలిస్తూ ప్రధాన రహదారుల్లో ఊరేగించారు. వేణుగోపాలస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారులగుండా తిక్కస్వామి దర్గా మీదుగా లక్ష్మమ్మవ్వ గుడి వరకు వెళ్లి తిరిగి రథోత్సవం ఆలయానికి చేరుకుంది. రాత్రి భజన కార్యక్రమం, రాత్రి 12 గంటలకు జోల కార్యక్రమాలు జరిగాయి.

కౌతాళం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని కామవరం, వివిధ గ్రామాల్లో ఘనంగా జరిగాయి. కామవరం గ్రామంలో యాదవులు శ్రీకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు వేసిన శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామల వంటి వేశధారణలు, చిన్నారులు చేసిన నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. చిన్నతనంలో శ్రీకృష్ణుడు చేసిన అల్లరి వేషాలు, గోపికలను ఆటపట్టించిన దృశ్యాలను చిన్నారులు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. అనంతరం శ్రీకృష్ణుని చిత్ర పటంతో గ్రామంలో ఊరేగింపు చేపట్టారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక గీతా మందిర్‌తో పాటు తాలూకా యాదవ సంఘం ఆధ్వర్యంలో తేరుబజారులో నిర్వహించిన వేడుకల్లో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణుని వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టి అలరించారు.



ఆదోనిలో వేణుగోపాల స్వామి రథం ముందు కలశాలతో చిన్నారులు, యువత

ప్రత్యేక పూజల అనంతరం పట్టణంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు నిర్వహించారు.

గోనెగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోనెగండ్ల, పెద్దనేలటూర్, హెచ్ కైరవాడి తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ దేవాలయంలో తులసి సహస్రనామార్చన, గోపూజ, తులాభారం, గంగపూజ, పుష్ప, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. పెద్దనేలటూర్ గ్రామంలో కనుల పండువగా రథోత్సవం జరిగింది. ఆలయం నుంచి జమ్మిచెట్టు వరకు రథోత్సవం నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఎమ్మిగనూరు యాదవ సంఘం ఆధ్వర్యంలో ..



పెద్దనేలటూర్‌లో శ్రీకృష్ణుని రథోత్సవం



కామవరంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న దృశ్యం

ఉరుకుంద క్షేత్రం.. పులకించిన భక్తజనం





పూజలందుకుంటున్న ఈరన్న స్వామి, తుంగభద్ర దిగువ కాలువలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: శ్రావణమాసం నాల్గవ సోమవారం సందర్భంగా ఈరన్నస్వామి క్షేత్రం భక్తులతో పులకించింది. ఆలయ పరిసరాల్లో ఎటు చూసినా సుమారు కిలోమీటర్ దూరం వరకు భక్తజనంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి. దేవాలయానికి చేరుకునే దారులన్నీ భక్తులతో నిండిపోయాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు మనరాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి తరలివచ్చారు. భక్తులు ముందుగా ఎల్ఎల్‌సీ కాలువలో పుణ్యస్నానాలు ఆచరించి దర్శనానికి క్యూలైన్లో నిల్చున్నారు. లక్షకు పైగా భక్తులు స్వామిని దర్శించుకుని ఉంటారని అంచనా. శ్రావణమాసంలో సోమ, గురువారాల్లో ముఖ్యమైనవిగా భావిస్తుండడంతో ఆయా రోజుల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రత్యేకంగా సోమవారల్లో భక్తులు అధికంగా తరలివస్తారు. ఆదివారం నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరడం విశేషం. ఆదివారంతో పాటు సోమవారం కృష్ణాష్టమి సెలువు కలిసిరావడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం సాయంత్రం వరకు దర్శన క్యూలైన్లు భక్తులతో దర్శనమిచ్చాయి.


ఆంధ్ర రైతులకు న్యాయం చేయండి



కర్ణాటక మంత్రి, ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న రైతులు

కౌతాళం: మండలంలోని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని నదిచాగి, కుంబళనూరు, కుంబళనూరు క్యాంపు, మరళి గ్రామాల రైతులు కర్ణాటక మంత్రి బోసరాజు, ఎమ్మెల్యే హంపయ్య నాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తుంగభద్ర నదిపై కర్ణాటకలోని చీకలపర్వీ, కుంబళనూరు గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి కమ్ బ్యారెజ్‌కు కర్ణాటక ప్రభుత్వం రూ.397.5కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఆ రాష్ట్ర చిన్న నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, మాన్వి ఎమ్మెల్యే హంపయ్యనాయక్‌లు నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోనిపై గ్రామాల రైతులు అక్కడి తరలివెళ్లి తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నదిచాగి ఎంపీటీసీ లింగన్నగౌడ్, రైతులు రామన్నగౌడ్, వలిబాషా, పక్కీర, పలువురు మాట్లాడుతూ.. బ్యారెజ్ నిర్మాణం వల్ల తమ పొలాలు ఎంత వరకు నష్ట పోతాయి, మనకు నీటి లభ్యత ఏ విధంగా ఉంటుంది అన్న విషయాలను వారితో చర్చించినట్లు తెలిపారు. సందేహాలను నివృత్తి చేసిన తర్వాతనే భూమిపూజ చేపడుతామని మంత్రి, ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు.

ఆరోపణలు మానుకోవాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ఎంపీపీ ఈరన్న

కోసిగి: టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలపై ఆరోపణలు మానుకోవాలని కోసిగి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ ఈరన్న, కాంట్రాక్టర్ బసిరెడ్డి అన్నారు. సోమవారం కోసిగిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కోసిగిలోని భూగేని చెరువుకు వైఎస్సార్ సీపీ నాయకులు మరమ్మతులు చేపట్టడంతో పంట పొలాలు నీట మునిగాయని, రైతులకు అన్యాయం చేశారని టీడీపీ నాయకుడు కొండుగానీ వీరారెడ్డి , మరికొందరు అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన తనయుడు యువనేత వై.ధరణీధర్ రెడ్డి కోసిగి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారికంగా ఇరిగేషన్ అధికారుల అనుమతితో రూ.40లక్షలు వెచ్చించి భూగేని చెరువును మరమ్మతులు చేయించారన్నారు. చెరువును సమ్మర్ స్టోరేజీగా మార్చి సురక్షిత మంచినీటిని అందించాలని ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు చేయించి దాదాపు 90 శాతం పనులు పూర్తి చేయించారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆపివేయాల్సి వచ్చిందని చెప్పారు. పై ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు భూగేని చెరువులోకి వెళ్లకుండా బయటకు పంపేలా కాల్వ మళ్లింపు పనులు చేయించామన్నారు. అయితే కోసిగిలో ఇటీవల అత్యధికంగా 96.2 వర్షకురువడంతో ఎగువ ప్రాంతంలో కొండల నుంచి భారీగా వర్షపు నీరు ప్రవహించి వాగులు, వంకలు పొంగి పొర్లాయని చెప్పారు. భారీ వర్షాలకు రోడ్లు, డ్యామ్‌లు కొట్టుకుపోతుంటే పొలాల్లోకి నీళ్లు చేరకుండా ఎలా ఉంటాయని ప్రశ్నించారు. అయినా పొలాల్లో నీళ్లు చేరిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే ప్రత్యేకంగా జేసీబీని ఏర్పాటు చేసి నీటిని మళ్లించారని గుర్తు చేశారు. ఆ విషయం టీడీపీ నాయకులకు కనిపించలేదా అని మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం నలుగురిని వెనుకేసుకుని ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కోసిగి ప్రజల, రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లి నరసింహులు, మాన్వి రోగయ్య, అయ్యప్ప, వీరేష్, వాచ్‌మెన్ నారాయణ, విజయ్‌కుమార్, హారోన్ తదితరులు ఉన్నారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక
- రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల పరిశీలన



మాచాపురం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక



రైతులతో కలిసి రిజర్వాయర్ పరిశీలనకు వెళ్తున్న బుట్టా రేణుక

నందవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్నా ప్రభుత్వానికి రైతుల గోడు పట్టడం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక విమర్శించారు. సోమవారం మండలంలోని నదికైరవాడి, మాచాపురం, గంగవరం, పూలచింత గ్రామాలలోని గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని పంపుహౌస్‌లు, రిజర్వాయర్లను రైతులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టు పరిధిలో పంపుహౌసుల్లో స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి దుండగులు నాశనం చేయడం జరిగిందన్నారు. దుండగులు చోరీకి పాల్పడి మూడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులు సాగునీరు లేక గగ్గోలు పెడుతున్నా స్పందన లేదని వాపోయారు. ఇప్పటికీ రైతులు తమ పొలాలను బీళ్లుగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నదిలో పుష్కలంగా వరద నీరు ప్రవహిస్తున్నా ఎత్తిపోతలు లేకపోవడం శోచనీయమన్నారు. పంపుహౌస్‌ల మరమ్మతులకు పైసా కేటాయించకుండా ప్రభుత్వం వేడుక చూడటం విచాకరమన్నారు. హాస్పేట్ డ్యాం 19 గేటు కొట్టుకుపోయి లక్షలాది క్యూసెక్కులు దిగువకు వెళ్లాయని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు దిగొచ్చి రైతుల కష్టాలను తీర్చాలని కోరారు. అనంతరం మాచాపురం రిజర్వాయర్, నదికైరవాడిలోని చిలకడోణ ఎత్తిపోతల, పూలచింత ఎత్తిపోతల ప్రాజెక్టు స్టేజ్–1,2 పథకాల మోటార్లను, ట్రాన్స్‌ఫార్మర్‌లను పరిశీలించారు.త్వరలో మరమ్మత్తులు చేపట్టి రైతులకు సాగు నీరు అందించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, బీసీ సెల్ అధ్యక్షుడు విరూపాక్షిరెడ్డి, ఎల్లెల్సీ మాజీ డైరక్టర్ గడ్డం నారాయణరెడ్డి, వైఎస్సా ర్‌సీపీ నాయకులు కోటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం



మదర్‌థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్, మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: విశ్వమాత మదర్ థెరిస్సా మానవాళికి అందించిన సేవలు చిరస్మరణీయమని వేదాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, మల్లెల గ్రూప్స్ అధినేత ఆల్‌ఫ్రెడ్‌రాజు అన్నారు. సోమవారం వేదాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా 114వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ఎంబీ యెరుషలేం చర్చి వద్ద ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంబీ చర్చి పాస్టర్ జయన్న, కార్యదర్శి భాస్కర్‌బాబు, ఉషాగ్రూప్స్ హోటల్స్ యజమాని రామస్వామి, జైభీమ్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కం జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ కార్యాలయంలో

పట్టణంలోకి కేవీపీఎస్ కార్యాలయంలో మదర్ థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి కేవీపీస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, మండల అధ్యక్షుడు తిమ్మన్న పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు అరుణ్, చిన్నప్ప, చిన్న నరసన్న, ఆంథోని, కులుగొట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని వాసులకు జాతీయ పురస్కారాలు



ఆదోనికి చెందిన సేవాకర్త శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం



నిర్వాహకులతో అవార్డు అందుకుంటున్న పట్టణానికి చెందిన సేవాకర్త శ్రీనాథ్‌గుప్త

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన సేవాకర్త శ్రీనివాస్‌కు, ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా), ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తకు జాతీయ సేవా పురస్కారాలు దక్కాయి. సోమవారం విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాక్షేత్రంలో మదర్‌థెరిస్సా సొసైటీ సంస్థ వారు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎంపిక చేసి సేవా పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా సేవాకర్త శ్రీనివాస్‌కు బీఆర్ అంబేడ్కర్ జాతీయ సేవా పురస్కారం, వంకదారు శ్రీనాథ్‌గుప్తకు ఎన్టీర్ జాతీయ అవార్డు ప్రదానం చేశారు. వీరికి సేవా పురస్కారంతో ఘనంగా సత్కరించి శాలువా కప్పి మెమోంటో అందజేశారు.

కోతి బసవన్న గుడిలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎల్.బి. స్ట్రీట్‌లో వెలిసిన శ్రీ కోతి బసవేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆలయంలో ఉన్న హుండీ పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.15 వేలు దొంగలించబడ్డాయని ఆలయ క్యాషియర్ వెంకోబ తెలిపారు. వెంటనే వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.